

వాహనదారుడికి గులాబీ పువ్వు ఇస్తున్న ట్రాఫిక్ సీఐ సైదులు

ద్విచక్రవాహనదారులు తప్పక హెల్మెట్ ధరించాలి

అమీర్‌పేట, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనదారులు వాహనం నడుపుతున్నప్పుడు హెల్మెట్ ధరించడం ఎంతో ముఖ్యమని ఎస్ఆర్ నగర్ ట్రాఫిక్ సీఐ సైదులు సూచించారు. జాతీయ రహదారి మాసోత్సవాల్లో భాగంగా గురువారం మైత్రి వనం జంక్షన్‌లో ద్విచక్ర వాహనదారులకు గులాబీ పువ్వులను అందజేసి హెల్మెట్ ధరించడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. వాహనదారులు హెల్మెట్ ధరించడం ఎంత ముఖ్యమో తెలియజేస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. అలాగే, గతంలో జరిగిన ప్రమాదాలపై అవగాహన కల్పించేందుకు వీడియోలు, ఫొటోలను ప్రదర్శించారు. హెల్మెట్ ధరించి వాహనం వెనుక కూర్చున్న వ్యక్తుల (పిలియన్ రైడర్)కు గులాబీలు, మిఠాయిలు ఇచ్చి సత్కరించారు. ద్విచక్ర వాహనాలు నడిపే వ్యక్తులు కచ్చితంగా డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలని, డ్రైవర్‌తో పాటు వెనుక కూర్చున్న వ్యక్తి తప్పక హెల్మెట్ ధరించి ప్రయా ణం ప్రారంభించాలని సీఐ సైదులు సూచించారు.



పీవీఎన్ఆర్ మార్గంలో రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

రోడ్డు భద్రతపై అవగాహనా ర్యాలీ

ఖైరతాబాద్,జనవరి 16 (ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రతను ప్రతి ఒక్కరూ పాటిస్తూ ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ట్రాఫిక్ పోలీసులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. సైఫాబాద్ ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో గురువారం పీవీ నర్సింహారావు మార్గంలో జరిగిన ర్యాలీలో పోలీసులు యువతతో పాటు హెల్మెట్ లేని వారికి అవగాహన కల్పించారు. రోడ్డు నిబంధనలు పాటించని వారిని ఆపి వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు. దీంతో పాటు అన్ని నియమాలను పాటిస్తూ హెల్మెట్ పెట్టుకొని వాహనాలను డ్రైవ్ చేస్తున్న వారికి గులాబీ పూలను ఇచ్చి అభినందించారు. రోడ్డు భద్రత మాసం సందర్భంగా ఈ అవకాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు సైఫాబాద్ ఇన్‌స్పెక్టర్ ఆనంద్ తెలిపారు.

పేదలకు వరం సీఎంఆర్ఎఫ్

బోరబండ, జనవరి 16 (ఆంధ్ర జ్యోతి): ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరం లాంటిదని, వారి ఆరోగ్య పరిరక్షణకు భరోసాగా నిలుస్తోందని కార్పొరేటర్ సీఎన్ రెడ్డి అన్నారు. రాజీవ్ గాంధీ నగర్‌కు చెందిన కలిగిరి ఆనంద్ వైద్య ఖర్చుల నిమిత్తం సీఎంఆర్ఎఫ్ నుంచి రూ.60 వేలు మంజూరయ్యాయి. ఇందుకు సంబంధించిన చెక్‌ను గురువారం రహ్మత్‌నగర్‌లోని కార్యాలయంలో లబ్ధిదారుడికి కార్పొరేటర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.



లబ్ధిదారుడికి సీఎంఆర్ఎఫ్ చెక్‌ను అందజేస్తున్న కార్పొరేటర్ సీఎన్ రెడ్డి



డీజీఎంను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకుడు భవానీశంకర్

డ్రైనేజీ పైప్‌లైన్‌ను ఆధునికీకరించండి

బోరబండ, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): డివిజన్ పరిధిలోని బస్తీల్లో ఉన్న పురాతన డ్రైనేజీ పైప్‌లైన్లను పెప్‌లైన్‌ను తొలగించి, పెరిగిన జనాభాకు అనుగుణంగా కొత్త డ్రైనేజీ పైప్‌లైన్లను వేయాలని కాంగ్రెస్ పార్టీ నగర ప్రధాన కార్యదర్శి బండపల్లి భవానీ శంకర్ అన్నారు. జలమండలి జనరల్ మేనేజర్ హరీష్ శంకర్‌ను గురువారం కార్యాలయంలో కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా మంచినీరు, డ్రైనేజీ సమస్యలపై డీజీఎంతో చర్చించామన్నారు. డీజీఎంను కలిసిన వారిలో కాంగ్రెస్ నాయకులు గ్యార నాగరాజు, ఎండీ జాఫర్ హుస్సేన్, సాంబన్న, శ్రవణ్ తదితరులు ఉన్నారు.



మచ్చ వేణుగోపాల్ గౌడ్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే తలసాని

వేణుగోపాల్ గౌడ్‌ను పరామర్శించిన తలసాని

అమీర్‌పేట, జనవరి 16(ఆంధ్రజ్యోతి): అమీర్‌పేటకు చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకుడు మచ్చ వేణుగోపాల్ గౌడ్‌ను మాజీమంత్రి సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పరామర్శించారు. వేణు గౌడ్ తండ్రి రాములు గౌడ్ (86) ఆకస్మికంగా మృతి చెందిన విషయం తెలుసుకున్న తలసాని గురువారం కుమ్మరి బస్తీలో ఉన్న ఆయన నివాసానికి చేరుకుని పార్థివ దేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి తన ప్రగాఢ సంతాపం తెలియజేశారు. తలసాని వెంట పార్టీ డివిజన్ కార్యదర్శి నామన సంతోష్ కుమార్, నాయకులు అశోక్ యాదవ్, కూతురు నర్సింహ, కాట్గా బలరాం, సుమిత్ సింగ్, బాబా, శ్రీనివాస్ గౌడ్, జితేందర్ శుక్లాచ సాయి తదితరులు ఉన్నారు.

సమస్యలకు కేరాఫ్‌గా బోరబండ రైల్వేస్టేషన్

- తాగునీరు నిల్.. పని చేయని లిఫ్ట్
- దెబ్బతిన్న మెట్లు, దిమ్మెలు
- డంపింగ్ యార్డ్‌గా రైల్వేస్టేషన్ ప్రాంగణం



బోరబండ రైల్వే స్టేషన్

మోతీనగర్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): బోరబండ రైల్వే స్టేషన్ సమస్యలకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. ఎంఎంటీఎస్ కేంద్రంగా నగరంలోని వివిధ ప్రాంతాలకు ప్రజలు ఈ స్టేషన్ నుంచి నిత్యం వేల సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటారు. ప్రతి రోజూ ఉదయం 5 నుంచి రాత్రి 12 గంటల వరకు ప్రయాణికుల రాకపోకలు జరుపుతుంటారు. ఇంత రద్దీగా ఉండే ఈ రైల్వే స్టేషన్‌లో కనీస వసతులు లేక ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ఆదాయం పరంగా దేశంలోనే దక్షిణ మధ్య రైల్వే అగ్రస్థానంలో ఉండగా, రైల్వే స్టేషన్లలో వసతుల విషయానికి వచ్చేసరికి పరిస్థితి పూర్తి భిన్నంగా ఉందని ప్రయాణికులు విమర్శిస్తున్నారు.



చెత్త కుండీని తలపిస్తున్న తాగునీటి కుళాయి

పని చేయని వాటర్ ప్లాంట్...

రైల్వే స్టేషన్‌లో తాగునీటి వసతి పూర్తిగా లేదనే చెప్పొచ్చు. తాగునీటి కోసం ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. 24 గంటలూ తాగునీరు అందించేందుకు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన ఐఆర్‌సీటీసీ స్వజల్ మినరల్ వాటర్ ప్లాంట్ పని చేయడం లేదు. దీంతో ఇది స్టేషన్‌లో అలంకారప్రాయంగా దర్శనమిస్తోంది. స్టేషన్‌లోని ప్లాట్ ఫామ్ పొడవునా ఇరువైపులా ఏర్పాటుచేసిన నీటి కుళాయిలకు కనెక్షన్ ఇవ్వకపోవడంతో ఉపయోగంలో లేక అవి కాస్త చెత్త కుండీలుగా మారిపోతున్నాయి.

పని చేయని లిఫ్ట్.. దెబ్బతిన్న మెట్లు

రైల్వే స్టేషన్‌లో ఎగువ దిగువ రైల్వే ప్లాట్ ఫామ్‌ల వద్ద ఏర్పాటు చేసిన లిఫ్ట్ సరిగా పని చేయడం లేదు. నెలలో 20 రోజులు లిఫ్ట్ పని చేయదని ప్రయాణికులు చెబుతున్నారు. దీంతో ఇక్కడ ప్లాట్ ఫామ్ మారేందుకు ముఖ్యంగా వృద్ధులు, చిన్న పిల్లలు, మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. లిఫ్ట్ పని చేయకపోవడటంతో ఎంతో కష్టపడి మెట్ల మార్గంలో రాకపోకలు సాగిచాల్సి వస్తోంది. క్రాసింగ్ వంతెన ఎక్కేందుకు ఉన్న మెట్లు కూడా పూర్తిగా దెబ్బతిన్నాయి. అనేక చోట్ల మెట్లు పగిలిపోయి, ఐరన్ రాడ్లు ఊడిపోయి ఉన్నాయి. దెబ్బతిన్న ఈ మెట్లపై రాకపోకలు జరిపే సమయంలో ప్రయాణికులు ఒక్కోసారి ప్రమాదాలకు గురవుతున్నారు.

నిలబడే వేచి ఉండాలి...

రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులు కూర్చునేందుకు ఏర్పాటు చేసిన రాతి దిమ్మెలు పలుచోట్ల పగిలిపోయాయి. దిమ్మెలపై ఉన్న టైల్స్ విరిగిపోయి లోపల ఉన్న సిమెంట్ , రాళ్ల బయటకు కనిపిస్తున్నాయి. దీంతో ఇక్కడ కూర్చునేందుకు వీలు పడకపోవడంతో ప్రయాణికులు రైళ్ల కోసం నిలబడే వేచి ఉండాల్సి వస్తోంది.



పనిచేయని లిఫ్ట్

కొరవడిన పరిశుభ్రత..

రైల్వే స్టేషన్ ప్రాంగణంలో అపరిశుభ్రత రాజ్యమేలుతోంది. స్టేషన్‌లో ఎక్కడ చూసినా వ్యర్థాలతో నిండిన చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. దీంతో ప్రయాణికులు ముక్కు మూసుకొని స్టేషన్‌లోకి రావాల్సి వస్తోంది. స్టేషన్‌లోని అపరిశుభ్ర పరిస్థితులపై ఎన్నిసార్లు రైల్వే, పారిశుధ్య విభాగం అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా రైల్వే శాఖ ఉన్నతాధికారులు స్పందించి బోరబండ రైల్వే స్టేషన్‌లో వసతులు మెరుగుపర్చేందుకు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

జీహెచ్ఎంసీ కార్మికులను పర్మినెంట్ చేయాలి: సీఐటీయూ

పంజాగుట్ట, జనవరి16(ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీలో పనిచేస్తున్న కార్మికులను పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం రూ. 26 వేలు చెల్లించాలని సీఐటీయూ జూబ్లీహిల్స్ జోన్ కన్వీనర్ ఆర్.అశోక్ డిమాండ్ చేశారు. గురువారం జీటీఎస్ కాలనీలోని విద్యుత్ శాఖ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఈ నెల 22న తలపెట్టిన చలో జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం ముట్టడి కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జీహెచ్ఎంసీ కార్మికులందరికీ కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వడంతో పాటు, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని పర్మినెంట్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని అన్నారు. బయోమెట్రిక్ హాజరు పట్టికలో జరుగుతున్న అవకతవకలు, అధికారుల వేధింపులను అరికట్టాలని డిమాండ్ చేశారు. ఆదివారాలు, పండగల సందర్భంగా అందరికీ సెలవులు ఇవ్వాలని, సీఎం ఇచ్చిన హామీ ప్రకారం డబుల్ బెడ్ రూమ్, ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని కోరారు. కార్మికుల డిమాండ్ల సాధన కోసం ఈ నెల 22న తలపెట్టిన చలో జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం ముట్టడిని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు నగేష్, అమల, కోమల, మల్లమ్మ, నరసమ్మ, లక్ష్మి, చంద్రకళ, రమ తదితరులు పాల్గొన్నారు.



చలో జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం ముట్టడి కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు



పోలీస్ స్టాల్‌ను ప్రారంభిస్తున్న సీపీ ఆనంద్

ట్రాఫిక్ రూల్స్, సైబర్ నేరాలపై అవగాహన

- నుమాయిష్‌లో పోలీస్ స్టాల్‌ను ప్రారంభించిన సీపీ ఆనంద్

అఫ్జల్‌గంజ్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): దేశంలో ఏడాదికి 1.70 లక్షల మంది.. ప్రతీ మూడు నిమిషాలకు ఒకరు రోడ్డు ప్రమాదాల్లో మరణించడం బాధాకరమని నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ అన్నారు. నుమాయిష్‌లో ఏర్పాటు చేసిన ట్రాఫిక్ పోలీస్, సీసీఎస్ స్టాళ్లను ఆయన అడిషనల్ సీపీ విశ్వప్రసాద్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సీపీ సీవీ ఆనంద్ మాట్లాడుతూ.. ఏటా జరిగే నుమాయిష్‌లో పోలీస్ శాఖ స్టాల్‌ను ఏర్పాటు చేసి ట్రాఫిక్ రూల్స్ సైబర్ నేరాల పట్ల సందర్శకులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. నుమాయిష్‌లో మహిళల భద్రత కోసం ఉమెన్ సేఫ్టీ వింగ్ ఆధ్వర్యంలో పోలీసులు మఫ్టీలో ఉంటూ సీక్రెట్ కెమెరాలతో మహిళలు, యువతుల పట్ల అసభ్యంగా ప్రవర్తించే ఆకతాయిలను గుర్తించి వారిపై చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. తన చిన్నతనంలో తల్లితో పాటు నుమాయిష్‌కు వచ్చిన రోజులను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ డీసీపీలు రాహుల్ హెగ్డే, వెంకటేశ్వర్లు, పోలీస్ అధికారులు కవిత, ప్రసన్నలక్ష్మి, దారా కవిత, ఏసీపీలు ధనలక్ష్మి, సీఐలు బాలాజీ, హరిష్‌తో పాటు పాఠశాల విద్యార్థినులతో కలిసి రైలు ఎక్కి నుమాయిష్‌లో 10 నిమిషాలు పర్యటించారు.

అంబేడ్కర్ వర్సిటీలో ఎంబీఏ కొత్త కోర్సు

- 'హాస్పిటల్ అండ్ హెల్త్‌కేర్ మేనేజ్‌మెంట్' ను ప్రవేశపెట్టిన వర్సిటీ
- దరఖాస్తుకు ఫిబ్రవరి 15 ఆఖరు తేదీ

హైదరాబాద్ సిటీ, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ వర్సిటీలో ప్రవేశ పెట్టిన ఎంబీఏ (హాస్పిటల్ అండ్ హెల్త్ కేర్ మేనేజ్‌మెంట్) కోర్సు వివరాలతో రూపొందించిన గోడపత్రికను వర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి గురువారం విడుదల చేశారు. అపోలో ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెల్త్‌కేర్ మేనేజ్‌మెంట్ (ఏఐహెచ్‌సీఎం), కృష్ణ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (కిమ్స్), దారుసలాం ఎడ్యుకేషన్ ట్రస్ట్ (డీఈటీ) సంయుక్తంగా నిర్వహించే ఎంబీఏ (హాస్పిటల్ అండ్ హెల్త్‌కేర్ మేనేజ్‌మెంట్) కోర్సులో చేరేందుకు ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఫిబ్రవరి 15లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు మార్చిలో అర్హత పరీక్ష నిర్వహిస్తామని, మరిన్ని వివరాలకు వర్సిటీ వెబ్‌సైట్‌ను చూడాలన్నారు. కార్యక్రమంలో వర్సిటీ అకడమిక్ డైరెక్టర్ ప్రొఫెసర్ పుష్పా చక్రపాణి, మేనేజ్‌మెంట్ డీన్ ప్రొఫెసర్ ఆనంద్ పవార్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎల్‌వీకే రెడ్డి, అపోలో ఆస్పత్రి అధికారిణి ప్రొఫెసర్ విజయ రుద్రరాజు, కిమ్స్ ఆస్పత్రి ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రవికుమార్, యూనివర్సిటీ అధ్యాపకులు రవీంద్రనాథ్ సోలమన్, పల్లవి కట్బే, కిరణ్మయి, డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ భోజరాజు శ్రీనివాస్, డాక్టర్ రాధాకృష్ణ పాల్గొన్నారు.



అంబేడ్కర్ వర్సిటీలో ప్రవేశపెట్టిన ఎంబీఏ కొత్త కోర్సు పోస్టర్‌ను విడుదల చేస్తున్న వీసీ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి తదితరులు

తెలుగు కీర్తి జాతీయ ప్రతిభా పురస్కారానికి అరుణకుమారి ఎంపిక



ఎర్రగడ్డ, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ఎర్రగడ్డకు చెందిన ప్రముఖ కవయిత్రి, సాహితీవేత్త మండపాక అరుణకుమారి తెలుగు కీర్తి జాతీయ ప్రతిభా పురస్కారానికి ఎంపికయ్యారు. ఈ విషయాన్ని శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ ఒక ప్రకటనలో తెలియజేశారు. మండపాక అరుణకుమారి తెలుగు భాష, తెలుగు సంస్కృతి, తెలుగు వైభవం, సాహిత్యం, తెలుగు కళల పరిరక్షణ కోసం నిరంతరాయంగా కృషి చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. శ్రీశ్రీ కళావేదిక, తెలుగు అసోసియేషన్ ఆఫ్ నేషనల్ అకాడమీ బుక్ ఆఫ్ రికార్డ్స్, వరల్డ్ రైటర్స్ ఫోరం, వరల్డ్ పొయెట్రీ అకాడమీల సంయుక్త ఆధ్వర్యంలో ఈ తెలుగు కీర్తి జాతీయ ప్రతిభా పురస్కారాలను అందిస్తున్నామన్నారు. ఈనెల 21న విజయవాడలోని శ్రీ కవిత పూర్ణానంద విలాస్ కళావేదికలో జరిగే కార్యక్రమంలో ఈ అవార్డులను అందజేస్తామని కత్తిమండ ప్రతాప్ తెలిపారు. తెలుగు కీర్తి జాతీయ ప్రతిభా పురస్కారానికి తనను ఎంపిక చేసినందుకు శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్, జాతీయ కన్వీనర్ కె. రమావతి, జాతీయ అధ్యక్షురాలు ఈశ్వరి భూషణం, తెలుగు అసోసియేషన్ ఆఫ్ నేషనల్ అకాడమీ బుక్ ఆఫ్ రికార్డ్స్ సంస్థలకు అరుణకుమారి కృతజ్ఞతలు తెలిపారు.

ట్రాఫిక్ ఇబ్బందులకు చెక్ పెడదాం

- జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి

ఖైరతాబాద్,జనవరి16(ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ ఇబ్బందులు లేని ప్రాంతంగా ఖైరతాబాద్ జోన్‌ను తయారు చేయాలని, అన్ని శాఖల సమన్వయంతో దీనిని సాధించేందుకు సలహాలు ఇవ్వాలని జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి సూచించారు. గురువారం ఖైరతాబాద్‌లోని జోనల్ కార్యాలయంలో ట్రాఫిక్, శాంతిభద్రతల పోలీసులు, జీహెచ్ఎంసీ, విద్యుత్ , జలమండలి, హెచ్ఎండీఏ తదితర విభాగాల అధికారులతో ఆయన సమావేశమయ్యారు. ఇందులో ప్రధానంగా ట్రాఫిక్ సమస్యలకు చెక్ పెట్టేలా సూచనలు చేశారు. జంక్షన్ల అభివృద్ధితో పాటు అవసరమైన ప్రాంతాల్లో రోడ్లను విస్తరించాలని కోరారు. రోడ్లపై ట్రాఫిక్‌కు అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించాలని కోరారు. రోడ్లపై వర్షపు నీరు నిలవకుండా ఏర్పాట్లు చేయియాలని అధికారులను కోరారు. ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డే, పలు విభాగాల అధికారులు పాల్గొన్నారు.



వివిధ శాఖల అధికారులతో సమావేశమైన జెడ్సీ అనురాగ్ జయంతి

అక్రమ గ్యాస్ రీఫిల్లింగ్ కేంద్రాలపై పోలీసుల దాడి

- సిలిండర్లు, ఇతర సామగ్రి స్వాధీనం

బోరబండ, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా గ్యాస్ రీ ఫిల్లింగ్ చేస్తున్న పలు కేంద్రాలపై బోరబండ పోలీసులు గురువారం దాడి చేశారు. నిర్వాహకుల నుంచి గ్యాస్ సిలిండర్లు, ఖాళీ సిలిండర్లు, ఇతర సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. ఎస్ ఎండీ సర్దార్ జమాల్ తెలిపిన వివరాల ప్రకారం... బంజారా నగర్, స్వరాజ్ నగర్, రాణా ప్రతాప్‌నగర్, అల్లాపూర్‌లలో పోలీసులు దాడి చేశారు. ఈ సందర్భంగా పెద్ద గ్యాస్ సిలిండర్లు 3, ఖాళీ సిలిండర్లు 4, చిన్న సిలిండర్లు 3, సిలిండర్లలో గ్యాస్ నింపేందుకు ఉపయోగించే సామగ్రి కిట్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.



వినయ్ భాస్కర్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న సీఐ శ్రీనాథ్ రెడ్డి, సిబ్బంది

గుండెపోటుతో హెడ్‌కానిస్టేబుల్ మృతి

అమీర్‌పేట, జనవరి 16(ఆంధ్రజ్యోతి): ఎస్ఆర్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న వినయ్ భాస్కర్ (53) గుండెపోటుతో బుధవారం రాత్రి మృతి చెందాడు. స్టేషన్‌లో విధులు నిర్వహిస్తుండగా గుండెపోటు వచ్చింది. వెంటనే సమీపంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ రాత్రి 12.30 ప్రాంతంలో తుదిశ్వాస విడిచాడు. మృతదేహాన్ని బోయిన్‌పల్లిలోని నివాసానికి తరలించారు. డీఐ గోపాల్, ఎస్ఐలు, సిబ్బందితో కలిసి ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్ రెడ్డి.. వినయ్ భాస్కర్ ఇంటికి వెళ్లి మృతదేహంపై పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి తమ ప్రగాఢ సంతపాన్ని తెలియజేశారు. సీఐ వెంట ఎస్ఐలు శ్రావణ్ కుమార్, అఖిల, రాజు రాథోడ్, నర్సింగ్‌రావు తదితరులు ఉన్నారు. దహన సంస్కారాల కోసం కో- ఆపరేటివ్ సొసైటీ నుంచి రూ. 50 వేలు, పోలీసు డిపార్ట్‌మెంట్ నుంచి రూ. 30 వేలు అందజేశారు. అంత్యక్రియల కోసం బంధువులు మృతదేహాన్ని బాపట్లకు తరలించారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

పంజాగుట్ట,జనవరి16(ఆంధ్రజ్యోతి): మరమ్మతుల కారణంగా బంజారాహిల్స్ ఏడీఈ పరిధిలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏడీఈ జి.గోపి తెలిపారు. ఉదయం 10 నుంచి ఉదయం 11 గంటల వరకు 11 కేవీ సాంగ్రిల్లా, సాగర్ సొసైటీ ఫీడర్ల పరిధిలోని సాంగ్రిల్లా అపార్ట్‌మెంట్, బంజారా హిల్స్ రోడ్ నెంబర్ 2, సాగర్ సొసైటీ సిగ్నల్, ఐడీబీఐ బ్యాంక్, బంజారా హిల్స్ చల్లా కంటి ఆసుపత్రి ప్రాంతాల్లో, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు 11 కేవీ జింఖానా క్లబ్, సినిమాక్స్ ఫీడర్ల పరిధిలోని క్రీమ్ స్టోన్, జింఖానా క్లబ్, కేబీఆర్ పార్క్, వైశ్య బ్యాంక్, వరుణ్ మోటార్స్ ప్రదీప్ కన్‌స్ట్రక్షన్స్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ పేర్కొన్నారు.



జటాయు వాహనంతో ట్రయల్ రన్ నిర్వహిస్తున్న జీహెచ్ఎంసీ అధికారులు

జీహెచ్ఎంసీకి 'జటాయు'

- వాక్యూమ్ క్లీనర్‌లా భారీ చెత్తను సేకరిస్తున్న యంత్రం

ఖైరతాబాద్,జనవరి16(ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీలోకి చెత్తను దానికదే ఎత్తే కొత్త యంత్రం అందుబాటులోకి వచ్చింది. జటాయు పేరుతో 3000 ఆర్‌పీఎం సామర్థ్యం కలిగి ఉన్న వాక్యూమ్ క్లీనర్ యంత్రాన్ని ఖైరతాబాద్ గణపతి వెనుక భాగంలో చెత్త ఉన్న ప్రాంతంలో ట్రయల్ రన్ కింద పరీక్షించారు. ఈ యంత్రం కొబ్బరి బొండాలను, మంచినీటి బాటిళ్లను, పెద్ద పాటి చెత్తను లోనికి గాలి ద్వారా సేకరిస్తుంది. దీని పనితీరును జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్ (శానిటేషన్) రఘుప్రసాద్, ఖైరతాబాద్ ఉప కమిషనర్ రజనీకాంత్, వైద్యాధికారి ఈ. చంద్రశేఖర్ తదితరులు పరిశీలించారు.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య


రాకేష్ కుమార్

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): కుటుంబ గొడవలు, ఆర్థిక పరమైన ఇబ్బందులతో జీవితంపై విరక్తి చెందిన ఓ వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న ఘటన లాలాగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. సికింద్రాబాద్ రైల్వే హెడ్ కానిస్టేబుల్ పండరి వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ పికెట్ లక్ష్మీనగర్ ప్రాంతానికి చెందిన రాకేష్ కుమార్ (44) భార్య కూతు రు ఉన్నారు. భార్య ఉద్యోగం చేస్తుండగా, అతనికి ఉద్యోగం లేదు. దీంతో ఆర్థిక ఇబ్బందుల కారణంగా జీవితంపై విరక్తి చెందిన రాకేష్ కుమార్ గురువారం లాలాగూడ రైల్వే స్టేషన్ సమీపంలో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు.

కదులుతున్నరైలు దిగబోతూ...



కదులుతున్న రైలు దిగబోతూ ఓ ప్రయాణికుడు రైలు చక్రాల కింద పడి మృతి చెందిన ఘటన సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో చోటు చేసుకుంది. సికింద్రాబాద్ రైల్వే హెడ్ కానిస్టేబుల్ కోటేశ్వర్‌రావు వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో బుధవారం కాగజ్‌నగర్ ఎక్స్‌ప్రెస్ రైలు నుంచి గుర్తు తెలియని 40 ఏళ్ల వ్యక్తి రైలు దిగబోతు కాలుజారి రైలు చక్రాల వద్ద పడి తీవ్ర గాయాలపాలయ్యాడు. వెంటనే సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు అతడిని గాంధీ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.


రెస్టారెంట్‌లో తగలబడుతున్న ఫర్నిచర్, ద్విచక్రవాహనం

రెస్టారెంట్‌లో అగ్నిప్రమాదం: రూ.10లక్షల నష్టం

హైదర్‌నగర్, జనవరి16(ఆంధ్రజ్యోతి): కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ రెస్టారెంట్‌లో అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో రెండు ద్విచక్రవాహనాలు, హోటల్‌లో ఫర్నిచర్ దగ్ధమయ్యాయి. కూకట్‌పల్లి ఫైర్ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం... గురువారం వేకువజామున కూకట్‌పల్లి భాగ్యనగర్ కాలనీలోని కంచుకోట రెస్టారెంట్‌లో కరెంటు షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం సంభవించింది. హోటల్‌లో మంటలు చెలరేగడంతో స్థానికులు గమనించి ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. హుటాహుటిన అక్కడకు చేరుకుని ఫైర్ ఇంజన్‌సాయంతో మంటలు ఆర్పివేశారు. ఈ ఘటన జరిగిన సమయంలో హోటల్ సిబ్బంది కొందరు హోటల్‌లోపల నిద్రిస్తున్నారు. అగ్నిప్రమాదం జరగగానే వారు బయటకు పరుగులు తీశారు. మంటలు సిలిండర్లకు అంటుకోకముందే ఆర్పడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ప్రమాదంలో ఫర్నిచర్, రెండు ద్విచక్ర వాహనాలు కాలిబూడిదయ్యాయి. ఈ ఘటనలో సుమారు రూ.10లక్షల మేర ఆస్తినష్టం జరిగిందని హోటల్ యజమాని తెలిపారు.

బ్రౌన్ షుగర్ అమ్ముతున్న ముగ్గురు యువకుల అరెస్టు

హైదర్‌నగర్,జనవరి16(ఆంధ్రజ్యోతి): నిషేధిత బ్రౌన్‌షుగర్‌ను అమ్మేందుకు ప్రయత్నిస్తున్న ముగ్గురు యువకులను కేపీహెచ్‌బీ పోలీసులు అరెస్టుచేశారు. ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు వివరాల ప్రకారం... కలాలి నాని(25), కుర్వ ప్రకాశ్(30), గాండ్ల నవీన్‌కుమార్(30) ఈజీగా డబ్బులు సంపాదించేందుకు డ్రగ్స్ అమ్మాలని పథకం వేసుకున్నారు. ఈ క్రమంలో ముగ్గురు యువకులు కూకట్‌పల్లి ఎల్లమ్మబండకు చెందిన వరుణ్(24) అనే యువకుడి వద్ద నుండి రూ.14,000 చెల్లించి 2గ్రాముల బ్రౌన్‌షుగర్ కొనుగోలు చేశారు. దాన్ని ఎక్కువ ధరకు అమ్మి సొమ్ము చేసుకోవాలనుకున్నారు. బుధవారం సాయంత్రం 6.30 గంటలకు కేపీహెచ్‌బీ కాలనీ విశ్వనాథ్ థియేటర్ వద్ద దానిని అమ్మేందుకు ప్రయత్నించారు. తెలుసుకున్న కేపీహెచ్‌బీ పోలీసులు నాని, ప్రకాష్, నవీన్‌ను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి బ్రౌన్ షుగర్ పాకెట్‌ను, ద్విచక్రవాహనం, నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఊరెళ్లి వచ్చేసరికి ఇల్లు గుల్ల

21 తులాల బంగారం, రూ.5 వేల అపహరణ

పేట్‌బషీరాబాద్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : ఊరెళ్లి వచ్చేసరికి ఇంట్లో ఉన్న బంగారాన్ని దొంగలు దోచుకెళ్లారు. పేట్‌బషీరాబాద్ పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... బొద్దనగర్ పక్కనే ఉన్న విజయహోమ్స్‌లో 10 నంబరు విల్లాలో ఉంటున్న శ్యామల ఉదయ్‌సాయి ప్రసన్న సంక్రాంతికి ఈ నెల 12వ తేదీన ఖమ్మం వెళ్లింది. తిరిగి 15వ తేదీ సాయంత్రానికి బొద్దనగర్‌కు వచ్చింది. ఇంట్లోకి వెళ్లి చూసేసరికి బీరువా తాళాలు పగులకొట్టి, వస్తువులన్నీ చిందర వందరగా పడి ఉన్నాయి. బీరువాలో ఉంచిన 13 తులాల మ్యాంగో హారం, అయిదు గాజులు, నల్లపూసల గొలుసు, చెవి రింగులు మొత్తం కలిపి 21 తులాల బంగారాన్ని, రూ.5 వేలు నగదును దోచుకెళ్లారు. గురువారం ఇంటి యజమాని ఉదయ్ సాయిప్రసన్న పేట్‌బషీరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ఆధారాలను సేకరించి, ఆ ప్రాంతంలో ఉన్న సీసీ కెమెరాలను జల్లెడ పడుతున్నారు. విల్లా వెనుక భాగంలో ఉన్న ఖాళీ స్థలం నుంచి ప్రహరీ దూకిన దొంగ విల్లాకు ఉన్న గ్రిల్స్‌ను తొలగించి, ఇంట్లోకి ప్రవేశించి దొంగతనానికి పాల్పడ్డారు. గదిలో ఉన్న వెండి వస్తువులను దొంగలు వదిలి వేసి వెళ్లారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.


తెలంగాణ యాదవ సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు సాదం బాలరాజుయాదవ్

తెలంగాణ యాదవ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

బొద్దనగర్, జనవరి16(ఆంధ్రజ్యోతి): చిలకలగూడ కట్టమైసమ్మ, పోచమ్మ ఆలయంలో గురువారం తెలంగాణ యాదవ సంఘం నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. తెలంగాణ యాదవ్ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు సాదం బాలరాజుయాదవ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అనంతరం ఆలయచైర్మన్ గుంటి కృష్ణ, ఆలయ ట్రస్టీసభ్యులు జగన్, దేవేందర్‌యాదవ్‌లు బాలరాజుయాదవ్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు మల్లేష్‌యాదవ్, గంగుల మధుయాదవ్, సత్యనారాయణ, నాగరాజు, కత్తెర శ్రీనివాస్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా డ్రైనేజీ మ్యాన్‌హోళ్లు

● గుంతలతో భయం భయం ● వాహనదారుల ఇక్కట్లు



నెహ్రూనగర్ కాలనీలో...



మారేడుపల్లి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): డ్రైనేజీ మ్యాన్‌హోళ్లకు నాసిరకం మరమ్మతులు చేపట్టడంతో అవి ప్రమాదకరంగా మారాయి. మోండా డివిజన్ పరిధి మారేడుపల్లి నెహ్రూనగర్ కాలనీలోని రోడ్డు నంబర్ 4లోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం వద్ద, రోడ్ నంబర్ 1లోని కెనడీ స్కూల్ వద్ద ప్రధాన రహదారి మధ్యలో ఇటీవల పదుల సంఖ్యలో డ్రైనేజీ మ్యాన్‌హోళ్లకు మరమ్మతులు చేపట్టారు. రోడ్లకు సరిసమానంగా మ్యాన్‌హోళ్లు లేకపోవడంతో గుంతల్లో వాహనదారులు పడి ప్రమాదాలకు గురవుతున్నారు. వెస్ట్ మారేడుపల్లి నుంచి గీతా నర్సింగ్ హోమ్ వరకు రాకపోకలు సాగించే వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. రాత్రి సమయంలో గుంతలు కానరాక ప్రమాదాల బారిన పడుతున్నామని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వాహనాలు సైతం దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆదేవిధంగా నెహ్రూనగర్ కాలనీలోని అంతర్గత రోడ్లలో ఏర్పాటు చేసిన మ్యాన్‌హోళ్ల దుస్థితి అలానే ఉంది. మరమ్మతులు చేపట్టిన సమయంలో అధికారుల పర్యవేక్షణలేని కారణంగా నాసిరకం మరమ్మతులు చేపట్టకపోవడంతో అవి కొద్దిరోజులకే పాడై గుంతలు ఏర్పడ్డాయి. వాహనదారులు, కాలనీ వాసుల రాకపోకలను దృష్టిలో ఉంచుకొని మ్యాన్‌హోళ్లను రోడ్డుకు సరిసామానంగా ఆధునీకరించాలని అధికారులను డిమాండ్ చేస్తున్నారు.

నాసిరకం పనులతోనే గుంతలు



డ్రైనేజీ మ్యాన్‌హోళ్ల చుట్టూ నాసిరకం పనులు చేపట్టడంతో కొద్దిరోజులకే గుంతలు ఏర్పడ్డాయి. ఈ రహదారిలో ప్రయాణించాలంటే భయం వేస్తుంది. వెంటనే నాణ్యతతో కూడిన పనులను చేపట్టాలి.

- నర్సింగరావు, నెహ్రూనగర్ కాలనీ

ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని భయం..



మారేడుపల్లి నెహ్రూనగర్ ప్రధాన, అంతర్గత రోడ్లలో వాహనంపై వెళ్లాలంటే ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయం. మ్యాన్‌హోళ్ల చుట్టూ గుంతలు పడి తవ్విన చోట్ల మరమ్మతులు చేపట్టకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి.

- రాములు మారేడుపల్లి

హెల్మెట్ ధరించండి.. ప్రాణాలు కాపాడుకోండి



వాహనదారులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఏసీపీ సంపత్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, హెల్మెట్ ధరించిన వాహనదారులకు గులాబీ పువ్వులు అందించిన ఏసీపీ శంకర్

బొద్దనగర్, జనవరి16(ఆంధ్రజ్యోతి): వాహనదారులు హెల్మెట్‌ను తప్పక ధరించాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఈస్ట్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ సంపత్ కుమార్ అన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా గురువారం అలుగడ్డబావిలో హెల్మెట్ లేకుండా నడుపుతున్న ద్విచక్ర వాహనాదారులకు చిలకలగూడ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సిహెచ్.శ్రీనివాసులు, ఏసీపీ కౌన్సెలింగ్ నిర్వహించారు. వాహనదారులకు గులాబీ పువ్వులిచ్చి ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కోరారు.

పుష్పగుచ్ఛాలతో...

తిరుమలగిరి జనవరి 16 (ఆంధ్రజ్యోతి): రహదారి భద్రతా నియమాలను తప్పక పాటించాలని ట్రాఫిక్ ఏసీపీ శంకర్ రాజు పిలుపునిచ్చారు. జాతీయ రహదారి భద్రతా మహోత్సవాలను పురస్కరించుకొని గురువారం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మధుబాబు, ఎస్సై శ్రీకాంత్ తమ సిబ్బందితో కలిసి తిరుమలగిరి చౌరస్తాలో ప్రయాణికులకు హెల్మెట్ ధరించడంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హెల్మెట్ ధరించిన ద్విచక్ర వాహనదారులకు పుష్పగుచ్ఛాలు అందజేసి ప్రశంసించారు. పిలియన్ రైడర్లు కూడా తమ వ్యక్తిగత భద్రత కోసం హెల్మెట్ ధరించాలని అభ్యర్థించారు. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా వ్యక్తులకు హెల్మెట్ లను పంపిణీ చేసి హెల్మెట్ ధరించాలని వారిని అభ్యర్థించారు.

66 ఏళ్లు సాగిన ఆస్తి తగాదాపై హైకోర్టు తుది తీర్పు

మక్తాపై వివాదానికి ముగింపు

హైదరాబాద్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): వారసుల మధ్య 66 ఏళ్ల పాటు సాగిన ఆస్తి తగాదా కేసులో గురువారం హైకోర్టు తుది తీర్పు ఇచ్చింది. నగరానికి చెందిన నవాబ్ మొయినుద్దులా బహదూర్ కుమార్తె సుల్తానా జహాన్ బేగం 1953లో తొలుత ఆస్తుల విభజన కోసం సిటీ సివిల్ కోర్టులో సూట్ దాఖలు చేశారు. తర్వాత ఆ పిటిషన్ హైకోర్టుకు బదిలీ అయి సివిల్ సూట్ (సీఎస్ ఆఫ్ 7)గా నమోదయింది. ఈ కేసులో వారి మధ్య రాజీ కుదుర్చి ఒప్పందం చేసేందుకు హైకోర్టు రాజా కిషన్‌దాస్, నవాబ్ సలీంఖాన్‌లను కమిషనర్ కం రిసీవర్లుగా నియమించింది. 1959లో ప్రాథమిక డిక్రీ జారీఅయింది. 1966లో భూములు, షేర్లు, ఇతర ఆస్తుల విభజన చేసి విభజన చేసి తుది పంపిణీ స్టేట్‌మెంట్‌ను దాఖలు చేశారు. అయినా ఉనికిలో లేని మక్తా ఆస్తుల కోసం లిటిగేషన్ కొనసాగుతోంది. ప్రాథమిక డిక్రీలో లేని ఆస్తులను తరువాత చేర్చడం కుదరని పేర్కొన్న చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ ఎస్వీ శ్రవణ్ కుమార్ ధర్మాసనం.. ఆ కేసును ముగిస్తున్నట్లు పేర్కొంది. 1970 నాటి ఆదేశాల ప్రకారం ఫైనల్ డిక్రీని తయారు చేసి ఇవ్వాలని రిజిస్ట్రీకి హైకోర్టు ఆదేశాలు జారీచేసింది. దీనిపై సుప్రీంకోర్టులో ఉన్న ఇతర కేసులపై ఈ తీర్పు ప్రభావం ఉండబోదని స్పష్టంచేసింది.

ఊర్లనుంచి.. నగర బాట




సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి పండుగను పురస్కరించుకుని నగర వాసులు ఊరెళ్లిపోయి తిరిగి గురువారం చేరుకున్నారు. మూడు రోజుల పాటు పండుగ జరుపుకునేందుకు వెళ్లిన వారు తిరిగి నగర బాట పడుతున్నారు. గౌతమి, విశాఖ, గరీబ్‌రథ్, సింహపురి ఎక్స్‌ప్రెస్‌లతో పాటు ఇతర రైళ్లలో ప్రయాణికులు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు చేరుకుంటున్నారు.


అంబేడ్కర్ వర్సిటీలో ఎంబీఏ (హాస్పిటల్ అండ్ హెల్త్‌కేర్ మేనేజ్‌మెంట్) పోస్టర్‌ను విడుదల చేస్తున్న వీసీ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి

అంబేడ్కర్ వర్సిటీలో ఎంబీఏ కొత్త కోర్సు

దరఖాస్తుకు ఫిబ్రవరి 15 ఆఖరు తేదీ

హైదరాబాద్ సిటీ, జనవరి 16(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ వర్సిటీలో ప్రవేశ పెట్టిన ఎంబీఏ (హాస్పిటల్ అండ్ హెల్త్‌కేర్ మేనేజ్‌మెంట్) కోర్సు వివరాలతో రూపొందించిన గోడపత్రికను వర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి గురువారం విడుదల చేశారు. అపోలో ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెల్త్ కేర్ మేనేజ్‌మెంట్ (ఏఐహెచ్‌సీఎం), కృష్ణ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (కిమ్స్), దారుసలాం ఎడ్యుకేషన్ ట్రస్ట్ (డీఈటీ) సంయుక్తంగా నిర్వహించే ఎంబీఏ (హాస్పిటల్ అండ్ హెల్త్‌కేర్ మేనేజ్‌మెంట్) కోర్సులో చేరేందుకు ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఫిబ్రవరి 15లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు మార్చిలో అర్హత పరీక్ష నిర్వహిస్తామని, మరిన్ని వివరాలకు వర్సిటీ వెబ్‌సైట్‌ను చూడాలన్నారు. కార్యక్రమంలో వర్సిటీ అకడమిక్ డైరెక్టర్ ప్రొఫెసర్ పుష్పా చక్రపాణి, మేనేజ్‌మెంట్ డీన్ ప్రొఫెసర్ ఆనంద్ పవార్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎల్‌వీకే రెడ్డి, అపోలో ఆస్పత్రి అధికారిణి ప్రొఫెసర్ విజయ రుద్రరాజు, కిమ్స్ ఆస్పత్రి ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రవికుమార్, యూనివర్సిటీ అధ్యాపకులు రవీంద్రనాథ్ సోలమన్, పల్లవి కబ్డే, కిరణ్మయి, డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ భోజరాజు శ్రీనివాస్, డాక్టర్ రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మాజీ కేంద్ర మంత్రి జైపాల్‌రెడ్డికి ఘన నివాళి


స్ఫూర్తిస్థల్ వద్ద నివాళులర్పిస్తున్న బీసీ కమిషన్ మాజీచైర్మన్ వకుళా భరణం కృష్ణమోహన్ రావు - రాంగోపాల్‌పేట్, (ఆంధ్రజ్యోతి)


మాజీ కేంద్ర మంత్రి ఎస్.జైపాల్ రెడ్డి జయంతిని పురస్కరించుకుని జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతశోభన్ రెడ్డి గురువారం జైపాల్ రెడ్డి సమాధిని సందర్శించి పూలమాలలతో శ్రద్ధాంజలి ఘటించారు. - తార్నాక, (ఆంధ్రజ్యోతి)

'బేగంబజార్‌లో లబ్ధిదారులకే షాప్‌లు కేటాయించాలి'

హైదరాబాద్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): గతంలో కుదుర్చుకున్న ఒప్పందం మేరకు బేగంబజార్ చేపల మార్కెట్‌లో 236 మంది లబ్ధిదారులకు షాప్‌లు కేటాయించాలని మజ్లిస్ పార్టీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. నిజాం కాలం నుంచి చేపల వ్యాపారం చేస్తున్న కుటుంబాలకే నూతనంగా నిర్మించిన షాప్‌లను కేటాయించాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహినుద్దీన్ పురపాలక శాఖ కార్యదర్శి దానకిషోర్‌కు విజ్ఞప్తి చేశారు. 2016లో బేగంబజార్‌లోని పురాతన చేపల మార్కెట్‌ను ఆధునికీకరించేందుకు కూల్చివేసే సందర్భంలో ఇక్కడ వ్యాపారం చేస్తున్న 236 మంది చేపల వ్యాపారులతో ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకున్నట్టు గంగపుత్ర సంఘం ప్రతినిధులు మజ్లిస్ పార్టీ అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీకి సమర్పించిన వినతిపత్రంలో పేర్కొన్నారు.



రేషన్‌కార్డు సర్వే.

బొద్దనగర్ న్యూఅశోక్‌నగర్, అంబర్‌నగర్‌లో గురువారం నిర్వహించిన రేషన్ కార్డుల దరఖాస్తుల సర్వేలో పాల్గొన్న కాంగ్రెస్‌పార్టీ బొద్దనగర్ డివిజన్ అధ్యక్షులు అనిల్‌కుమార్, జీహెచ్ఎంసీ ఏఈ లావణ్య తదితరులు.

- (బొద్దనగర్, ఆంధ్రజ్యోతి)

ట్యూషన్ ఫీజు చెల్లింపునకు ఆఖరు తేదీ ఈనెల 25

అంబేడ్కర్ వర్సిటీ అధికారులు

హైదరాబాద్ సిటీ, జనవరి 16(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో డిగ్రీ, పీజీ ద్వితీయ, తృతీయ సంవత్సరం చదివే విద్యార్థులు ట్యూషన్ ఫీజు చెల్లించేందుకు జనవరి 25 వరకు సమయం కేటాయించామని విద్యార్థి సేవల విభాగాధిపతి డాక్టర్ వై.వెంకటేశ్వర్లు ఓ ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే అడ్మిషన్లు పొంది, సకాలంలో ఫీజు చెల్లించలేని విద్యార్థులు జనవరి 25వ తేదీలోపు ఆన్‌లైన్‌లో చెల్లించాలని సూచించారు. పూర్తి వివరాల కోసం అధ్యయన కేంద్రంలో లేదా.. వర్సిటీ హెల్ప్‌లైన్ నంబర్లు 040- 23680222/333 /444/555 పై సంప్రదించాలని కోరారు. పూర్తి వివరాలు వర్సిటీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు.



కంటోన్మెంటు బోర్డు 7వ వార్డు మాజీ సభ్యుడు ప్యారసారి శ్యామ్‌కుమార్ గురువారం బోయిన్‌పల్లి సౌజన్య కాలనీలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డిని కలిశారు. సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపి, శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వార్డు-7 బీఆర్ఎస్ పార్టీ ఉపాధ్యక్షుడు యశ్వంత్ కుమార్, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు ఎర్రోళ్ల రుక్మయ్య, బీసీ విభాగం ఉపాధ్యక్షుడు ఉమేష్, సీనియర్ నాయకుడు చిన్నన్న ఉన్నారు.

- తిరుమలగిరి, (ఆంధ్రజ్యోతి):



సికింద్రాబాద్ సివిల్ కోర్టులో డైరీ ఆవిష్కరిస్తున్న బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వై.వసంత్ కుమార్

న్యాయవాదులు కలిసి పనిచేయాలి: వసంతకుమార్

అడ్డగుట్ట జనవరి 16 (ఆంధ్రజ్యోతి): న్యాయవాదులు ఐక్యంగా కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని సికింద్రాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వై.వసంత్ కుమార్ అన్నారు. 2025 నూతన సంవత్సరం పురస్కరించుకుని సికింద్రాబాద్ సివిల్ కోర్టులో పనిచేస్తున్న సీనియర్ న్యాయవాదుల పేర్ల ప్రింట్‌తో కూడిన నూతన డైరీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, న్యాయవాదులు ఐక్యంగా పనిచేసి జడ్జీలకు చేదోడు వాదోడుగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జూలూరీ సుశీల్ కుమార్, ఉపాధ్యక్షుడు టీవీ రమణ, సంయుక్త కార్యదర్శి బుచ్చిబాబు, ప్రవీణ్ కుమార్ నవీన్ రెడ్డి, సౌమ్య, పుష్పలత, హిమవర్థ పాల్గొన్నారు.

మహంకాళి పోలీస్ స్టేషన్‌లో అత్యాచారం కేసు

రాంగోపాల్ పేట్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : మహంకాళి పోలీస్ స్టేషన్ పరిధిలో తనవద్ద పనిచేసే యువతిపై యజమాని (55) అత్యాచారం చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం.. మహంకాళి పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న పార్క్‌లేన్ సమీపంలో ఓ ప్యాకింగ్ కంపెనీని నడుపుతున్న వ్యక్తి వద్దకు 2018లో ఓ యువతి (33) ఉద్యోగం కోసం వచ్చింది. ఆమెపై కన్నేసిన యజమాని కొంతకాలం తరువాత చాట్ తినిపించే క్రమంలో అందులో మత్తుమందు ఇచ్చి అత్యాచారం చేశాడని, అశ్లీలంగా ఉన్న ఫొటోలు తీసుకున్నాడని తెలిపారు. వాటిని సోషల్ మీడియాలో పెడతానని బెదిరిస్తూ ఆ యువతిపై తరచూ అత్యాచారం చేస్తూ వచ్చాడని పోలీసులు తెలిపారు. విసిగిపోయిన యువతి గురువారం మహంకాళి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.


సమావేశంలో మాట్లాడుతున్న దరువు అంజన్న

లక్ష డప్పులు- వేలగొంతులు

మహాప్రదర్శనకు తరలిరావాలి

సికింద్రాబాద్, జనవరి16(ఆంధ్రజ్యోతి): ఫిబ్రవరి 7వ తేదీన హైదరాబాద్‌లో నిర్వహించే లక్షడప్పులు - వేలగొంతులు మహాప్రదర్శనకు బీసీ కవులు, కళాకారులు, రచయితలు, మేధావులు లక్షలాదిగా తరలి రావాలని కవి, గాయకులు దరువు అంజన్న పిలుపునిచ్చారు. బలంరాయి డ్రీమ్‌ల్యాండ్ గార్డెన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 30 ఏళ్ల పోరాట ఫలితంగా ఎస్సీ వర్గీకరణ అమలు దగ్గరలోనే ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు.